
ఏస్
ఎక్స్పీరియన్స్
విత్ షైన్ ప్రైస్!
A.S.Murty

"అంటే మీ అమ్మాయిని చేసుకోమని అడగటానికి వచ్చారా?"

శివరామయ్యమీద పిడుగు పడినట్లయింది. ఇందాకటి నుంచి శ్రద్ధగా వింటున్నట్లు కనిపిస్తున్న వేణుగోపాల్ నుంచి అటువంటి ప్రశ్న వచ్చేసరికి నోరాడలేదు సమాధానానికి.

"అయితే మీ ఆశ చంపుకోవచ్చు, శివరామయ్యగారూ ..." శివరామయ్య నోరు మెదపటం చూసి వారిస్తూ, "వినండి, నాకు పెళ్ళయింది. నా భార్య అందగత్తె. ఆరోగ్యవంతురాలు. నెల క్రితమే కాన్పుకి పుట్టింటికి వెళ్ళింది. చాలా? అనవసరంగా ఇంతసేపూ మీ టైము వృథా చేసుకున్నారు, నా టైమునీ వృథా చేశారు" అన్నాడు లేస్తూ.

శివరామయ్య గొంతు కేదో అడ్డం పడ్డట్లయింది. బలవంతాన మాటలు పెగుల్చుకుంటూ, "వేణుగోపాల్ గారూ! చివర్లో తొందర పడుతున్నారు. నేను మిమ్మల్ని పెళ్లి కొడుగ్గా చూడటానికి రాలేదు. పెళ్లికొడుకుని నిశ్చయించాను" అంటూండగా, వేణు అందుకుని—"పురోహితుడుగా పని చెయ్యమనటానికి వచ్చి ఉంటారు. అంతేనా?" అన్నాడు. అతని ముఖంలో కోపం, టైమంతా వేస్టయిందన్న చిరాకు ప్రతిబింబించాయి.

"అలా అనకండి. కేవలం నాకు సహాయం చేయమని అర్థిస్తున్నాను. తలా అయిదు రూపాయలు ఇస్తూ వచ్చారు. ఇక పెళ్లి చేసి, ఒక తెలుగింటి ఆడపడుచు కొక ఇల్లు ఏర్పరచిన వారవుతారు. మీరూ సానుభూతితో ఆలోచించండి."

"సారీ, శివరామయ్యగారూ! నగరంలో యాంత్రిక జీవనానికి అలవాటుపడ్డ వాళ్లం. అంత సానుభూతితో ఆలోచించటానికి కాలం చాలదు. జీవితమూ చాలదు. క్షమించండి" అంటూ టవల్ మీద వేసుకుని బాత్ రూములోకి నడిచాడు.

శివరామయ్య అలాగే కూర్చుండిపోయాడు. తన శ్రమ అంతా వృథా అవుతుందేమోనన్న బాధ, అయిందేమోనన్న ఆవేదన మింగివేస్తూ కూర్చుండిపోయాడు.

తిరిగి వచ్చిన వేణుకి అయిలాగా కూర్చుండిపోయిన శివరామయ్య కనుపించాడు.

"మీ రింకా వెళ్లలేదూ?"

ఛెళ్ళు మన్నది ప్రశ్న. శివరామయ్య వెంటనే లేచి నిలుచున్నాడు.

"క్షమించాలి. మీ అమూల్యమైన కాలాన్ని వృథా చేశాను."

"ఇప్పు డేమనుకున్నా అయిందేదో అయింది. ఇక మీరు వెళ్లవచ్చు."

శివరామయ్య తటపటాయించాడు. ఏమిటన్నట్లు చూశాడు.

"సహాయంగా మీకు తోచింది—చివరకు రూపాయైనా సరే, అయిదు పైసలైనా సరే ఒక పెళ్లి జరగటానికి తోడ్పడుతుంది, వేణుగోపాల్ గారూ! అంతకన్నా నేనేమీ అర్థించటం లేదు. సాటి మానవుడుగా నా పరిస్థితి నర్థం చేసుకొని సహాయం చేయమని వేడుకుంటున్నాను."

వేణు నవ్వాడు. "అసలు మీరు చెప్పిన కథ నిజమని నమ్మే దెట్లా! కూటికోసం కోటి విద్యలు, మాస్టారూ! చెప్ప నవసరం లేదు. ఈ కాలంలో ఎవర్నీ నమ్మలేము. అంతగా ప్రాధేయపడుతున్నారు గనక ఇదిగో నాకు తోచింది. ఇక నడవండి" అంటూ గబగబ బట్టలు వేసుకుని, జేబులో దొరికిన నాణెం ఆయన వణుకుతున్న చేతిలో పెట్టి బయటకు నడిచాడు. వెనకాలే గుప్పిట మూసి నడిచాడు శివరామయ్య. రూముకు తాళం వేసి, వెనకనే నిలబడి ఉన్న శివరామయ్యను చూడనైనా చూడకుండా చకచక నడుస్తూనే వెళ్లిపోయాడు వేణు.

చేతిలో మెరుస్తున్న అయిదు పైసల నాణాన్ని చూచుకుంటూ నిలబడిపోయాడు శివరామయ్య.

ఆ సాయంత్రం తిరిగి గది తలుపు తీస్తున్న వేణుకి ప్రొద్దుటి సంఘటన గుర్తు వచ్చింది. గర్వంగా నవ్వుకున్నాడు.

'లేకపోతే కథ అల్లి తనను ఫూల్‌ను చేసి ఆడించాలనుకున్నాడు ముసిలాడు. తనకు ఇలాటి వాళ్లతో బాగా అనుభవమే. నిజం కనుక్కునేసరికి చిత్తయిపోయాడు. మారాడకుండా బయటకు నడిచాడు' అనుకుంటూ నవ్వుకున్నాడు.

వారం రోజులు గిర్రున తిరిగాయి. ఆ రోజు శనివారం.

"ఒరేయ్! వేంకటేశ్వరస్వామి కోవెలకు వెళ్లి వద్దామురా!" దీక్షితులు కదిలించాడు.

"ఎందుకురా? దేవుడిని చూడాలనిపిస్తూంది ఏమిటి?" వేణు నవ్వాడు.

"అబ్బే, అదేం లేదనుకో ..." నసిగాడు దీక్షితులు.

"అయినా హైదరాబాదు మూలల నుంచి గూడా ఇక్కడకు వస్తారు దేవుడిని చూడటానికి. మన మింతవరకూ వెళ్లలేదు కదా? ఓసారి వెళ్లి వద్దామని."

దీక్షితులు సమర్థన వింటే నవ్వు వచ్చింది.

"సరోజగాని వస్తానం దేమిటి?"

గతుక్కుమన్నాడు దీక్షితులు.

"సరే, పద. చూస్తైనా వంతోషిద్దాం. పుణ్యం సంపాదించుకుందాం" అంటూ దారి తీశాడు.

# స్వాగతము

### దూపాటి సంపత్కుమారాచార్య

త్రలిరాకు తోరణావళిగూర్చి ఋతురాజు
యానతుం డయ్యె నాహ్వానమునకు!

అందంద మకరంద బిందుల సుమబాల
యలరి వచ్చినది యర్ఘ్యమ్ము గూర్ప!

కలకలా రావమ్ము గలుగ కోకిల బాల
గళము విప్పెను మంత్ర గానమునకు!

తొలిమూలు ఫలముల నెలమావి తలదాల్చి
వెలయించె నేడె. నైవేద్యమునకు!

యెడద వాకిలి తెరచి రీ యెడ జనాళి
ప్రతి గృహాభ్యంతరోత్సవ ప్రతిమ వగుచు
నిత్య వాసంత శోభల నింప రమ్ము
కదలిరా! "పరీధావి" యుగాది లక్ష్మి! ★

"ఎవర్ని?" వేణు సనుమానంగా చూస్తూ అడిగాడు.

"నీవు సరోజను. నే నా దేవుడిని."

"అమ్మయ్య! అయితే పద" అంటూ వెంబడించాడు.

గుడి మెట్ల దగ్గరే ఎవరో నిలిపివేసినట్లు నిలబడిపోయాడు వేణు. కాళ్ళు సాగలేదు. కాళ్ళు వణికాయి ఒక క్షణం. అతని చూపులు కొత్త పెళ్లికొడుకునీ, పెళ్లి కూతుర్నీ వెంటబెట్టుకుని మెట్లు దిగుతున్న ముసలాయన మీద ఉన్నాయి.

"ఏమిరా?" దీక్షితులు అడిగాడు ఆయోమయంగా.

మాట్లాడలేదు వేణు. అతనిహృదయాన్నెవరో కలిచివేసినట్లయింది. "అసలు మీ కథ నిజమని నమ్మక మేముంది, శివరామయ్యగారూ!"

వేణుని చూశాడు శివరామయ్య.

ఆనందంతో చేతులూపుతూ, "వేణుగోపాల్ గారూ!" అని పిలిచాడు శివరామయ్య.

ఛెళ్ళుమని కొట్టినట్లయింది వేణుకి.

ఇంతలో దగ్గరగా వచ్చారు వాళ్ళు. ఆ అమ్మాయి ముఖంలో పసితనం, అమాయకత్వం మూర్తీభవించాయి. చామనచాయ రంగు. ఆ అబ్బాయి కూడా అందగాడే. పసుపు బట్టల్లో విందుగా ఉన్నారు.

శివరామయ్య వేణుగోపాల్ చేతిలో అక్షత లుంచుతూ, "చూడండి, వేణుగోపాల్ గారూ. మా చివరి అమ్మాయి ఇది. ఇక నా బాధ్యత తీరిపోయింది. రామా, కృష్ణా అంటూ కాలం గడపగల నిక. వీరికే ముందు ఎంతో జీవిత ముంది. వారి జీవితం మూడు పువ్వులు ఆరు కాయలు కావాలని కోరుతూ ఆశీర్వదించండి!" అన్నాడు.

కళ్లలో నీళ్ళు తిరుగుతూండగా, అక్షత లుంచాడు వారి శిరస్సు మీద. వారు ఇతనెవరో తెలియకపోయినా, వంగి నమస్కరించారు.

"వస్తానండి!" అంటూ చరచరా ముందుకు నడిచి వెళ్లిపోయాడు వేణుగోపాల్. శివరామయ్యగారి ముఖం చూసే ధైర్యం లే దతనికి. చూడలేదు. ఆ నిజాయితీ ముందు తలి ఎత్తలేడు.

"ఏమిట్రా? ఎవ రాయన?" దీక్షితులు అడిగాడు.

దేవుడి హారతి కళ్లకద్దుకుంటున్న వేణు, ఏమీ మాట్లాడలేదు. మాట్లాడలేడని తెలుసు.

ఎదురుగా స్వామి నవ్వుతున్నట్లనిపించింది. *